# సొసైటీల అభివృద్ధే మన ధ్యేయం

– ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

వైవీయూ : ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్) ల అభివృద్ధే ధ్యేయంగా కడప డీసీసీ బ్యాంకు పనిచేస్తోందని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని డీసీసీ బ్యాంకు కార్యాలయంలో పీఏసీఎస్ సిబ్బందికి ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని, సొసైటీ సిబ్బంది ఉత్సాహం చూపిస్తే అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. బ్యాంకు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని సిబ్బంది నైపుణ్యం పొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్, సూర్యనారాయణ, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకుల ఏర్పాటుకు సహకారం అందించండి

జిల్లా వ్యాప్తంగా డీసీసీ బ్యాంకు, సొసైటీలు ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుకు సహకారం అందించాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి కోరారు. గురువారం కడప నగరంలోని జిల్లా కలెక్టరేట్‌లో జేసీ గణేష్‌కుమార్‌ను కలిసి డీసీసీ బ్యాంకు సంబంధించిన పెండింగ్ ఫైల్స్‌ను త్వరితగతిన క్లియర్ చేయాలని కోరారు. జిల్లాలో చెన్నమరాజుపల్లి, వెల్లటూరు, పి. టంగుటూరు సొసైటీల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లు ప్రారంభించడానికి ఎన్‌ఓసీ ఇవ్వడానికి నెలల తరబడి తిరుగుతున్నామని, ఫైల్స్ క్లియర్ కావడం లేదని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. జేసీ మాట్లాడుతూ డీఆర్ఓ, ఆర్‌డీఓలకు ఆదేశాలు జారీచేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

## 31 నుంచి పీఎన్ఆర్ మెగా వాలీబాల్ టోర్నమెంట్

కడప కార్పొరేషన్: పోచిమరెడ్డి నరేన్ రామాంజుల రెడ్డి ఓపెన్ మెగా వాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 31వ తేది నుంచి జూన్ 1 వరకూ జరుగనుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్‌క్రీం రవి, ఎం. సుబ్బరాయుడు, సుబ్బరాయుడు, సుదర్శన్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి, జి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లె గాంధీనగర్ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరుగనుందని, ఇందులో గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.25వేలు, మూడో బహుమతిగా రూ.15వేలు ఇవ్వనున్నామన్నారు. 31వ తేదీ ఉదయం 7 గంటలకు క్రీడాకారులు హాజరు కావాలని తెలిపారు. అంపైర్ నిర్ణయమే అంతిమమని చెప్పారు. ఆసక్తిగల వారు ఈనెల 28వ తేదిలోపు ఎంట్రీ ఫీజు కింద రూ.1000 చెల్లించాలన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొననున్న క్రీడాకారులకు సీఆర్‌ఐ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భోజన వసతి కల్పిస్తామన్నారు.


వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఈ కార్యక్రమంలో సిటీ కేబుల్ మేనేజింగ్ పార్టనర్ కొత్త ఉదయ్ కుమార్, సీఆర్ఐ ట్రస్టు చైర్మన్ సునీల్ జయంత్ పాల్గొన్నారు.

## సీఎం జగన్ నిర్ణయంపై ఉలేమాల హర్షం

కడప కల్చరల్ : హజ్ యాత్రికులకు మేలు చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్ర ఉలేమా అయిమ్మా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గురువారం కడప నగరంలోని సంస్థ కార్యాలయంలో సంస్థ గౌరవాధ్యక్షులు, హజ్‌కమిటీ డైరెక్టర్ మౌలానా వలీవుల్లా హుస్సేనీ సాహెబ్ మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల హజ్ యాత్రికులు ఒక్కొక్కరు ముందుకంటే 83 వేల రూపాయలు చెల్లించాల్సి వచ్చిందన్నారు.

పేద ముస్లింలు ఈ మొత్తం చెల్లించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి ప్రభుత్వ బాధ్యతగా భావించి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ముస్లిం మైనార్టీలపై సీఎంకు గల చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని కొనియాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు హజరత్ ముఫ్తీ మహమ్మద్‌అలీ బగ్దాదీసాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా హజ్ యాత్రికుల సౌకర్యం కోసం విజయవాడ నుంచి నేరుగా యాత్రకు వెళ్లేలా ఎంబార్ కేషన్ పాయింట్ తీసుకురావడం హర్షణీయమన్నారు. విజయవాడ గన్నవరం ఎంబార్‌కేషన్ నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న 1814 మంది హాజీలకు నేరుగా వారి ఖాతాల్లో రూ. 14,51,20,000 జమ చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినందుకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కమిటీ కార్యదర్శి మౌలానా ఫక్రుద్దీన్, కోశాధికారి మౌలానా అబ్దుల్‌రషీద్, కమిటీ సభ్యులు, మౌలానాలు ఖలీలుల్లా, భక్తియారుద్దీన్, అమీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉలేమా సంస్థ ప్రతినిధులు

### మైనార్టీలకు అండగా ప్రభుత్వం

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ప్రతి విషయంలోనూ అండగా నిలుస్తోందని ప్రభుత్వ ఖాజీ హాఫీజ్ షేక్ ఇసాక్ సాహెబ్ అన్నారు. గురువారం రవీంద్ర నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా ఒక్కొక్కరికి రూ. 3.80 లక్షలవుతుందని సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించగా, హజ్ యాత్రికులపై పడే సుమారు రూ.80 వేలను ప్రభుత్వమే భరించడం సంతోషదాయకమన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం చేయలేదని, ఒక్క ఏపీ ప్రభుత్వమే చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి తామెప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, షేక్ మగ్బూల్ షరీఫ్, జమీల్, సమద్ పాల్గొన్నారు.

## సంస్కృతికి దూరమవడం బాధాకరం

కడప కల్చరల్ : మన దేశ ఔన్నత్యానికి ప్రతీక అయిన సంస్కృతి సంప్రదాయాలు క్రమంగా దూరమవుతుండటంతోనే సమాజంలో నానాటికీ విలువలు దూరమవుతున్నాయని యోగివేమన విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆచార్యులు ఎస్.ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మ్యూజియమ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో సంస్కృతీ సంప్రదాయాలు కొరవడుతున్నాయి కనుకనే వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యక్షులు మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని మ్యూజియాలకు మంచి దశ వచ్చేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. గౌరవ అతిథి వైవీయూ చిత్ర కళ విభాగం సమన్వయకర్త కోట మృత్యుంజయరావు ప్రార్థనాలయాలు, శిల్పాలు, పురాతన భవనాల రూపంలో గల మన వారసత్వ సంపద రక్షణ గురించి ప్రజలలో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు.

చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ ఇంటాక్ మండల శాఖల ప్రతినిధులు వారసత్వ సంపద రక్షణ బాధ్యతను తీసుకునేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా తొలుత కడపలోని మహావీర్ మ్యూజియాన్ని ఇంటాక్ బృందం సందర్శించింది. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ బ్రహ్మయ్య, ఇంటాక్ కో కన్వీనర్ సుబ్బారెడ్డి, జోజిరెడ్డి, సంజీవరెడ్డి, చిన్నపరెడ్డి, భారతి, కొండూరు జనార్ధనరాజు, కోటేశ్వరరావు, రాణి, లెక్కల జమాల్‌రెడ్డి, ముఖేష్, రామయ్య, గౌరి, శంకర్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఈశ్వరరెడ్డి

## పరిశుభ్రత.. ఆరోగ్యానికి భద్రత

కడప కల్చరల్ : కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీవితంలో ఆరోగ్యానికి గల ప్రాధాన్యం గురించి ఆ రంగ నిపుణులు విష్ణువర్ధన్ వివరించారు. మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందని, మనం పాటించే శుభ్రత ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కుంటే చాలా రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్‌లు సుబ్రమణ్యం, నవాబ్‌జాన్, జేమ్స్, సిబ్బంది శ్రీనివాసులు, రామ్ ప్రతాప్, నాగలక్ష్మి, సుబ్బమ్మ, హరికృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

**జేవీవీ ఆధ్వర్యంలో..** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం రవీంద్రనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శిక్షకులు, రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం విద్యార్థులకు పలు కథలను ఆసక్తికరంగా వివరించారు. కథ చెప్పడం, వినడం, చదవడం, సృజనను వృద్ధి కరించే గుణాన్ని పెంచుతాయని, ఊహను సన్నివేశాల రూపంలో చూసుకునే సృజనను కల్పిస్తాయన్నారు. ఇతర శిక్షకులు యోగ, చేతిరాత, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జేవీవీ నాయకులు చంద్రకళ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.


చేతులు శుభ్రం చేయడం నేర్పుతున్న శిక్షకులు

## శ్రీకాశీవిశ్వేశ్వరుడికి మాసోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో గల శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి గురువారం మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించి, పుష్పాలు, బంగారు ఆభరణాలతో కనులపండువగా అలంకరించారు. సాయంత్రం అర్చకులు పిడతల మురళీకృష్ణ, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రదోషకాల పూజ నిర్వహించారు. ఉత్సవమూర్తులను నందివాహనంపై కొలువు తీర్చి పల్లకీసేవ నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి, దూపదీప నైవేద్యం, కర్పూరహారతి, అనంతరం ఆలయ ప్రాకారోత్సవాన్ని మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఉత్సవం ఘనంగా సాగింది. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



## ప్రైమ్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

– 10 కేజీల కణితిని తొలగింపు

కడప రూరల్/ కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని బాకరాపేటకు చెందిన యాభై ఏళ్ల మహిళ కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆమె చికిత్స కోసం కడప నగరానికి రాగా కడుపులో 10 కేజీల కణితి ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ మహిళ కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలోని ప్రైమ్ హాస్పిటల్‌లో స్త్రీ వ్యాధుల కాన్పుల వైద్యనిపుణులు డాక్టర్ అక్షిత చంద్రశేఖరరెడ్డిని కలిసింది. తనకున్న సమస్యను వివరించింది. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించారు. కడుపులో భారీ పరిణామంలో కణిత ఉన్నట్లు గుర్తించారు. అనంతరం గురువారం ఆమెకు శస్త్ర చికిత్సను నిర్వహించారు. విజయవంతంగా కడుపులో ఉన్న 10 కేజీల కణితి తొలగించారు. ఈ సందర్భంగా ఆ హాస్పిటల్ ఎండీలు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, గంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అక్షిత చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ గడ్డను తొలగించామన్నారు. పెద్ద నగరాలకు ధీటుగా కడపలోనే శస్త్ర చికిత్సలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బ్రుంగి మహేష్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ఉన్న ల్యాప్రోస్కోపీ, అత్యాధునిక సేవలను వినియోగించుకోవాలని వారు కోరారు.


తొలగించిన కణితిని చూపుతున్న డాక్టర్

## మట్కా ఆడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న కడప ఒన్‌టౌన్ సీఐ నాగరాజు

కడప అర్బన్: ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ లాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు హెచ్చరించారు. గురువారం సాయంత్రం నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో మట్కా ఆడుతున్న ముగ్గురిని కడప ఒన్‌టౌన్ సీఐ నాగరాజుతో పాటు, ఎస్ఐలు మధుసూదన్ రెడ్డి, రంగస్వామి, సిద్దయ్యలు తమ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో మట్కా రాస్తున్న షేక్ అబ్దుల్ రజాక్, వల్లపు రెడ్డి ఆంజనేయ ప్రసాద్, షేక్ మహమ్మద్ ఆలీలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 45 వేలు నగదు సీజ్ చేశారు.

### రైతులకు నష్టపరిహారం అందిస్తాం

రామాపురం : మండలంలోని కల్పనాయునిచెరువు, గోపగుడిపల్లె, గువ్వలచెరువు, కొండావాండ్లపల్లె, హసనాపురం గ్రామాల్లోని రైతులతో ఎత్తిపోతల పథకం భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీఓ రంగస్వామి గురువారం ముఖాముఖిగా మాట్లాడారు. మండలంలో జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, సప్లై ఛానెల్‌లకు ఎత్తిపోతల పథకానికి భూ సేకరణలో కల్పనాయినిచెరువు, గోపగుడిపల్లె, గువ్వలచెరువు గ్రామాల పరిధిలో 28.53 ఎకరాలు, హసనాపురం పెద్ద చెరువు నుంచి చిన్నచెరువుకు 10.63 ఎకరాలు, కొండావాండ్లపల్లె నుంచి కుమ్మరకుంట వరకు 7 ఎకరాల భూమి ఎత్తిపోతల పథకానికి అవసరమని నష్టపరిహారంగా ప్రభుత్వం నుంచి రైతులకు నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన భూమి విలువలను తయారు చేసి తమకు పంపాలని రామాపురం తహసీల్దార్ అరవింద్ కిషోర్‌కు సూచించారు. రైతులు నష్ట పోకుండా వారికి ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద్ కిషోర్, ఇరిగేషన్ ఏఈ మహబూబ్‌బాషా, ఆర్ఐ వీఆర్‌ఓలు నరసింహులు, సుబ్బారెడ్డి, ప్రేమ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### 25న వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 25న ఉదయం 11 గంటలకు ఏఎస్పీ ప్రేరణ కుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయనున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన అసలైన యజమానులు ఎవరో తెలియరానందున వేలం వేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆర్టీఓ పరీక్షించి సూచించిన ధరల మేరకు వేలం వేయనున్నట్లు తెలిపారు. టాటా 10 టైర్ల లారీ, టాటా సుమో, టాటా సఫారి వాహనాలతో పాటు 17 మోటార్ బైక్‌లను వేలం వేస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని సీఐ కోరారు.

### గర్భిణులకు సేవలను అందించాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని గర్భిణులకు, బాలింతలకు విశిష్ట సేవలను అందించాలని డీఎం అండ్ హెచ్ఓ వైద్యాధికారి ఖాదర్‌వల్లి తెలిపారు. గురువారం మండలంలోని రసూల్‌పల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాంను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి గర్భిణులకు, బాలింతలకు అవసరమైన సేవలను అందించాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తుల పట్ల ఎప్పటికప్పుడు వివరాలను సేకరించి వారికి వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని పాతబస్టాండు వద్ద బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దస్తగిరిరెడ్డి, ఓబులేసు, వెంకట సుబ్బయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రవాణా పన్నులను తగ్గించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెట్రోల్, డీజిల్‌పై అత్యధిక పన్నులు వసూలు చేస్తున్నారని, వాటిని తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరుకు రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నులు పెంచడంతో నిత్యావసర సరుకుల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లింగన్న పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం


కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సీఐ సయ్యద్

కడప అర్బన్: మండు వేసవిలో ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా వున్న పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో గురువారం ఆయా పోలీస్ అధికారులు చలివేంద్రాలు ప్రారంభించారు. మజ్జిగ, చల్లటి మంచి నీరు అందించేలా ఏర్పాట్లు చేశారు. కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ ముందు సీఐ సయ్యద్ హాసం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

### యువజన కాంగ్రెస్ ఆర్టీఐ వైస్ చైర్మన్‌గా అమీర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: యువజన కాంగ్రెస్ ఆర్టీఐ వైస్ చైర్మన్‌గా అమీర్ బాషను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ మేరకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఆర్టీఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు మధు రెడ్డి, చెప్పలి పుల్లయ్య, పాలగిరి శివ తదితరులు పాల్గొన్నారు.

### శానిటరీ సెక్రటరీల ఆగడాలను అరికట్టాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో కొందరు శానిటరీ సెక్రటరీల ఆగడాలను అరికట్టాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి కోరారు. గురువారం కమిషనర్ ప్రవీణ్‌చంద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. ప్రశాంత్‌వర్ధన్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పట్ల శానిటేషన్ సెక్రటరీల వైఖరి మారకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కంపోస్టు యార్డు వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు, వీధి దీపాలు, నీటి వసతి, మేస్త్రీలకు రూమ్ వసతి కల్పించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. రోడ్డు విస్తరణలో పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి ఆప్కాస్‌లో ఉద్యోగం ఇవ్వాలన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

పులివెందుల టౌన్ : జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు పులివెందులకు చెందిన ఆర్.ప్రసన్న అనే విద్యార్థిని ఎంపికైంది. ఈ విద్యార్థిని వచ్చేనెల 20వ తేదీ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిలో జరిగే జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలలో పాల్గొననుంది. ఈ విద్యార్థినికి కోలాప్రసాద్ రూ.6 వేలు అందించారు.

### అగస్త్యేశ్వరునికి పూజలు


పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరునికి తెల్లవారుజామున రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి సుందరంగా అలంకరించారు. ఉదయం 7 గంటలకు గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆసీనులను చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ ఈఓ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న మను పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్

వైవీయూ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హకీముద్దీన్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, హానికర మందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మీర్జా విలయత్ అలీబేగ్, ఖాజామైనుద్దీన్, సికిందర్ హుస్సేన్, అష్రఫ్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

### తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలి


క్షేత్ర సందర్శనలో అధికారులు, శాస్త్రవేత్తలు

వైవీయూ : తక్కువ పెట్టుబడి పెట్టి అధిక దిగుబడి సాధించే పంటల సాగును రైతులు అనుసరించాలని చింతకొమ్మదిన్నె కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డా. శిల్పకళ పేర్కొన్నారు. గురువారం చింతకొమ్మదిన్నె మండలంలోని ఆర్‌బీకేలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి సాధించే పంటలను సాగు చేయాలని సూచించారు. అనంతరం పొలంబడిలో భాగంగా చింతకొమ్మదిన్నె మండలంలోని పత్తిపంటను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ పద్మజ, ఈశ్వర్‌రెడ్డి, నందిని పాల్గొన్నారు.

### పూడిక ఎత్తేశారు


పూడిక మట్టి తొలగించిన తర్వాత దృశ్యం

కడప కార్పొరేషన్: కడప చిన్నచౌకులో మానస కళ్యాణ మండపం నుంచి అశోక్ నగర్ వరకూ ఉన్న డ్రైనేజీ కాలువలో పూడిక, రాళ్లు తీసి రోడ్డుపై వేశారు. ఇది పూర్తిగా ఎండిపోయినప్పటికీ తొలగించకుండా అలాగే ఉంచారు. దీనిపై ఈనెల 18వ తేది ‘సాక్షి’లో వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన అధికారులు గురువారం ఆ పూడికను ఎత్తివేయించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న పూడిక తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు హెల్ప్‌డెస్క్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీలలో చేరగోరే విద్యార్థుల కోసం కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. విద్యార్థులు తమ పేర్లను హెల్ప్‌డెస్క్ ద్వారా నమోదు చేసుకుని అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ అడ్మిషన్ల కోసం కళాశాల పనివేళల్లో కానీ, 98497 65838, 91776 82848 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### పదోన్నతుల అనుమానాలను నివృత్తిచేయాలి

వైవీయూ : విద్యాశాఖ విడుదల చేసిన ఉపాధ్యాయుల పదోన్నతుల మార్గదర్శకాలు, షెడ్యూల్‌పై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ కోరారు. గురువారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాత ప్రభుత్వ ఉత్తర్వు 12 ప్రకారం అర్హతలను నిర్ణయిస్తే తదుపరి మార్పులు, చేర్పుల ద్వారా వచ్చిన అర్హతల ద్వారా ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరిస్తారో తెలపాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్‌ల హోదాల్లో మార్పులు ఉండాలన్నారు. బదిలీలకు సంబంధించిన అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉచిత వడుగులు

కడప కల్చరల్ : దేశంలో ఎన్నో ఆచారాలను పాటిస్తారని, పెద్దలు రూపొందించిన ఈ ఆచారాల వెనుక ప్రజల ఆరోగ్యమే ప్రధానమని, వారి సంక్షేమంతోపాటు బాలల ఆరోగ్యం కోసమే ఈ కార్యక్రమం చేపట్టామని కడప అమీన్‌పీర్ దర్గా ముజావర్ అమీర్ తెలిపారు. అమీన్ ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ కేఎస్ఎస్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో గురువారం దర్గా సమీపంలోని నజీముల్ అమీన్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో ఉచితంగా వడుగుల (ఖత్నా) కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప నగరంతోపాటు సమీప ప్రాంతాల నుంచి కూడా తల్లిదండ్రులు తమ బాలలను ఈ కార్యక్రమానికి తీసుకొచ్చారు. వడుగులు చేయించుకున్న వారికి వస్త్రాలు, మందులు, నెయ్యి, గోధుమ పిండి ఉచితంగా అందజేశారు.